# అభివృద్ధి సమస్యలు - పరివర్తన

## ఆర్థిక వృద్ధి – ఆర్థికాభివృద్ధి భావనలు

**అభివృద్ధి – గమనాత్మక శక్తులు**

1950వ దశకం నుంచి వృద్ధి, అభివృద్ధి అనే అంశాలను గుర్తించారు. ఆర్థిక వృద్ధిని **(Growth),** ఆర్థికాభివృద్ధిని **(Development)** పర్యాయపదాలుగా వాడుతున్నా, ఈ రెండింటికి వేర్వేరు అర్థాలున్నాయి.

★ అభివృద్ధి అంటే పురోగతి **(Progress)** అనే అర్థంలో వాడతారు.

★ ఆర్థికాభివృద్ధిలో ఆర్థిక వృద్ధి ఒక భాగం.

★ ఆర్థికాభివృద్ధి అంటే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సాంకేతిక అంశాలకు సంబంధించి బహుముఖ కోణాల్లో అభివృద్ధి సాధించడం.

**ఆర్థిక వృద్ధి (Economic Growth)**

★ జాతీయ ఆదాయంలో పెరుగుదలను వృద్ధి అంటారు.

★ దీర్ఘకాలంలో జాతీయాదాయ పెరుగుదల నిలకడగా కొనసాగితే దాన్ని వాస్తవ వృద్ధి అంటారు.

★ "ఆర్థిక వృద్ధి అనే స్థిరమైన ప్రక్రియ ద్వారా ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక సామర్థ్యం పెరిగి ఉత్పత్తి, ఆదాయం పెరుగుతాయి"
**–ఎం.పి. తొడారో**

★ "ఆర్థిక వృద్ధి దీర్ఘకాల ప్రక్రియ. ఇది వాస్తవ జాతీయాదాయం. మొత్తం జనాభా, వాస్తవిక తలసరి ఆదాయంలో పెరుగుదల వస్తుంది".
**–సైమన్ కుజ్నెట్స్**

★ జనాభా పెరుగుదల కంటే వాస్తవిక జాతీయాదాయ పెరుగుదల ఎక్కువ ఉన్నపుడు ఆర్థిక వృద్ధి అనేది సాధ్యం అవుతుంది.

★ జనాభా పెరుగుదల రేటు < వాస్తవిక జాతీయ ఆదాయ పెరుగుదల రేటు → ఆర్థిక వృద్ధి

★ ఉత్పత్తి సామర్థ్యం పెరిగినప్పుడు ఆర్థిక వృద్ధి ఏర్పడుతుంది.

★ నిశ్చలస్థితి (Static) లో ఉత్పత్తి పెరిగితే వృద్ధి అంటారు.

**ఆర్థికాభివృద్ధి**

దేశంలో జాతీయాదాయంలో, తలసరి ఆదాయంలో పెరుగుదలతో పాటు సాంకేతిక వ్యవస్థాపూర్వక మార్పులు, వనరుల కేటాయింపులో మార్పులు ఏర్పడితే దాన్ని ఆర్థికాభివృద్ధి అంటారు.

★ ఆర్థికాభివృద్ధి జరుగుతున్న సందర్భంలో దేశ ఆర్థిక వ్యవస్థలో కింది పరిస్థితులు కనిపిస్తాయి.

1) ఆదాయ వ్యత్యాసాలు లేకపోవడం

2) స్థిరంగా తలసరి ఆదాయంలో వృద్ధి

3) అక్షరాస్యత, ఉద్యోగితలో పెరుగుదల

4) ప్రజా జీవన ప్రమాణ స్థాయిలో పెరుగుదల

5) ఉత్పత్తి పద్ధతుల్లో సాంకేతిక, వ్యవస్థాపూర్వక మార్పులు జరగడం

పై అన్ని అంశాల్లో జరిగే అభివృద్ధిని ఆర్థికాభివృద్ధి అంటారు.

అభివృద్ధి మానవ భౌతిక అవసరాలే కాకుండా సామాజిక జీవనంలో పెరుగుదలను పరిగణిస్తుంది. అంటే సామాజిక, సాంఘిక, సాంస్కృతిక, సంస్థాపరమైన, ఆర్థిక మార్పులను సూచిస్తుందని యూఎన్‌వో నిపుణుల కమిటీ అభిప్రాయపడింది.

★ మైకేల్ పి. తొడారో అభిప్రాయం ప్రకారం ఆర్థికాభివృద్ధి బహుముఖ ప్రక్రియ. దీనిలో త్వరితగతి వృద్ధి, సంపద అసమానతల వృద్ధి, పేదరిక నిర్మూలన లాంటి అంశాలు ఉంటాయి.



R-15-4-17

## ఆర్థికాభివృద్ధి – లక్ష్యాలు

★ ప్రజా జీవన ప్రమాణ స్థాయిని పెంచడం

★ సామాజిక న్యాయం

★ ఆధునికీకరణ

★ ఆర్థిక స్వయం పోషకత్వం

★ ఆర్థిక స్థిరత్వం

★ సమ్మిళిత వృద్ధి

## ఆర్థికాభివృద్ధి - సూచికలు

★ స్థూల జాతీయ ఉత్పత్తి

★ తలసరి స్థూల జాతీయోత్పత్తి

★ సంక్షేమం

★ సామాజిక సూచికలు

**స్థూల జాతీయోత్పత్తి (Gross National Production – GNP):**

ఒక సంవత్సర కాలంలో దేశంలో తయారైన వస్తుసేవల మార్కెట్ ద్రవ్యవిలువకు విదేశీ నికర ఆదాయం (ఎగుమతులు – దిగుమతులు) కలిపితే స్థూల జాతీయ ఉత్పత్తి వస్తుంది.

★ జాతీయ ఆదాయాన్ని నిలకడ/ వాస్తవ/ స్థిర/ ఆధార సంవత్సర ధరల్లో లెక్కిస్తే దాన్ని నిలకడ/ స్థిర ధరల్లో జాతీయ ఆదాయం అంటారు.

★ దేశంలో నిజ/ నిలకడ ధరల్లో జాతీయాదాయ పెరుగుదలను అభివృద్ధిగా పరిగణిస్తారు.

★ నిలకడ ధరల్లో జాతీయ ఆదాయం వృద్ధి రేటు = జనాభా వృద్ధిరేటు → అభివృద్ధి మార్పు లేదు.

★ నిలకడ ధరల్లో జాతీయ ఆదాయం వృద్ధి రేటు > జనాభా వృద్ధిరేటు → అభివృద్ధి ఉన్నట్లు.

★ నిలకడ ధరల్లో జాతీయ ఆదాయం వృద్ధి రేటు < జనాభా వృద్ధిరేటు → అభివృద్ధి తగ్గుదల.

★ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అన్ని అసమానతలు ఉండగా ఆర్థికాభివృద్ధికి GNP వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకోవడం సరికాదని రాబర్ట్ మాక్ నమురా (పశ్చిమ్‌బంగ – గవర్నర్, 1970) అన్నారు.

**తలసరి స్థూల జాతీయోత్పత్తి**

★ స్థూల జాతీయోత్పత్తిని జనాభాతో భాగించగా తలసరి స్థూల జాతీయోత్పత్తి వస్తుంది.

★ నిజ తలసరి ఆదాయం లేదా ఉత్పత్తి పెరుగుదలనే ఆర్థికాభివృద్ధి కొలమానంగా పరిగణిస్తారు.

★ నిజ తలసరి ఆదాయ పెరుగుదల రేటు జనాభా వృద్ధి రేటు కంటే ఎక్కువగా ఉండాలి. కానీ ఈ సూచిక ఒక సగటు మాత్రమే. అందరి ఆదాయాలు ఒకే విధంగా ఉండకపోవచ్చు. జీవన స్థాయిలను పెంచకపోవచ్చు.

★ దీని ఆధారంగా జీవన ప్రమాణ స్థాయిని కొలవలేం.

**సంక్షేమం**

★ ఆర్థిక శ్రేయస్సు/ సంక్షేమ దృష్టిలో వస్తుసేవల వినియోగంలో పెరుగుదలను ఆర్థికాభివృద్ధి అంటారు.

★ వస్తుసేవల ప్రవాహాల్లో అభివృద్ధి వల్ల భౌతిక శ్రేయస్సులో వచ్చే సుస్థిర దీర్ఘకాల వృద్ధినే ఆర్థికాభివృద్ధిగా ఒకున్, రిచర్డ్‌సన్ తెలిపారు.

★ వ్యక్తుల సంక్షేమం పెంచాలంటే వ్యక్తుల అభిరుచులు భిన్నంగా ఉంటాయి. కాబట్టి వ్యక్తుల సంక్షేమ సూచికల తయారీకి అందరికీ ఒకే భారితాలు (weightage) ఇవ్వలేం.

★ ఆదాయ పంపిణీలో సమానత్వం లేకుండా ఆర్థిక సంక్షేమం పెరిగినా ఆర్థికాభివృద్ధి జరిగిందని చెప్పలేం.

**సామాజిక సూచికలు**

★ అభివృద్ధికి కావాల్సిన ప్రాథమిక అవసరాలను సామాజిక సూచికలు అంటారు. ఇవి మానవాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాయి.

★ 1979 లో హిక్స్, స్ట్రీటన్ కింది ప్రాథమిక అవసరాలకు ఆరు సామాజిక సూచికలను గుర్తించారు.

అవి:

| **ప్రాథమిక అవసరాలు** | **సూచిక** |
|---|---|
| ఆరోగ్యం | ఆయుఃప్రమాణం |
| విద్య | అక్షరాస్యత |
| ఆహారం | తలసరి క్యాలరీలు |
| నీటి సరఫరా | శిశుమరణాల రేటు, తాగునీరు అందుబాటులో ఉన్న జనాభా శాతం |
| పారిశుద్ధ్యం | శిశుమరణాల రేటు పారిశుద్ధ్యం అందుబాటులో ఉన్న జనాభా శాతం |
| గృహవసతి | – |

అయితే ఈ సూచికల ఆధారంగా ఉమ్మడి సూచీ నిర్మించడం కష్టం.

**మానవాభివృద్ధి సూచికలు**

**భౌతిక జీవన ప్రమాణ సూచీ (Physical Quality of Life Index – PQLI):**

★ 1979 లో మోరిస్ ఈ సూచికను ప్రతిపాదించారు.

★ PQLI నిర్మాణం కోసం 1) శిశుమరణాలు 2) ఆయుఃప్రమాణం 3) అక్షరాస్యత అనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

★ ఈ మూడు అంశాలకు (0 – 100) విలువలు ఇచ్చి ఈ మూడింటి సగటు సూచికను PQLI అంటారు.

★ ఈ సూచీ సామాజిక, ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో వచ్చే మార్పులను పేర్కొనదు. అంతేకాకుండా ఇది మొత్తం శ్రేయస్సును కూడా కొలవదు.

**మానవ అభివృద్ధి సూచీ (Human Development Index – HDI):**

మహబూబ్ ఉల్‌హక్ (పాకిస్థాన్) నాయకత్వంలో 1990లో UNDP తన మొదటి మానవ అభివృద్ధి నివేదికలో ఈ సూచికను ప్రవేశపెట్టింది.

**HDI సూచిక నిర్మాణం:**

3 అంశాల అభివృద్ధి సగటును మానవాభివృద్ధి సూచిక కొలుస్తుంది.

| **అంశం** | | **సూచీ** |
|---|---|---|
| 1. దీర్ఘకాల ఆరోగ్యజీవనం | – | ఆయుర్దాయం |
| 2. పరిజ్ఞానం | – | వయోజన అక్షరాస్యత రేటు, విద్యారంగంలో ఉమ్మడి స్థూల విద్యార్థుల నమోదు నిష్పత్తి |
| 3. ఉన్నత జీవన ప్రమాణం | – | తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి |

★ పై మూడు అంశాల్లో ఒక్కో అంశానికి ఒక్కో సూచిక తయారు చేసి గరిష్ఠ, కనిష్ఠ విలువలు ఇస్తారు.

| సూచికలు | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| 1. ఆయుర్దాయం | 85 | 25 |
| 2. వయోజన అక్షరాస్యత రేటు | 100 | 0 |
| 3. స్థూల నమోదు నిష్పత్తి | 100 | 0 |
| 4. తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి (PPP) | 40,000 US$ | 100 US$ |

★ PPP అంటే కొనుగోలు శక్తి సమానత.

★ పై అంశాలకు 0 – 1 మధ్య విలువలు ఇస్తారు. తర్వాత ఈ కింది సూత్రం ద్వారా అంచనా వేస్తారు.

★ $$\text{అంశ సూచిక} = \frac{\text{వాస్తవిక విలువ} - \text{కనిష్ఠ విలువ}}{\text{గరిష్ఠ విలువ} - \text{కనిష్ఠ విలువ}}$$

పై మూడు అంశాల ఆధారంగా సూచికల సాధారణ సగటు విలువను మానవ అభివృద్ధి సూచికగా లెక్కిస్తారు.

★ అయితే ఈ సూచికలో స్థూల జాతీయ ఉత్పత్తికి స్థానం లేకపోవడం వల్ల సాంఘిక, రాజకీయ, లింగ అసమానతలకు ప్రాముఖ్యం ఇవ్వలేదని చెప్పవచ్చు.

**లింగ అసమానత సూచిక (Gender Inequality Index):**

1995 మానవాభివృద్ధి నివేదిక రెండు లింగ సూచికలను ప్రవేశ పెట్టింది.

1. లింగ సంబంధ అభివృద్ధి సూచిక (Gender Related Development Index – GDI)
2. లింగ సాధికారత సూచిక (Gender Empowerment Measure – GEM)

★ HDIలో తీసుకున్న ఆయుర్దాయం, విద్యా సంపాదన, ఆదాయం ఆధారంగా కొలిచే ప్రయత్నాన్ని లింగ సంబంధ సూచీ అభివృద్ధి చేసింది. మానవ అభివృద్ధి సూచీని లింగ అసమానత్వంలో సర్దుబాటు చేస్తారు.

★ HDIలో లింగ అసమానతలు ఎక్కువగా ఉంటే లింగ సంబంధ సూచీ HDI సూచీ కంటే తక్కువగా ఉంటుంది. HDI, లింగ సంబంధ అభివృద్ధి సూచికకు మధ్య తేడా అధికంగా ఉంటే అసమానతలు ఎక్కువగా ఉన్నట్లు తెలుపుతుంది.

**లింగ సాధికార కొలమానం (GEM):**

ఇది ఆర్థిక, రాజకీయ జీవితంలో స్త్రీ భాగస్వామ్యం ఎలా ఉందో తెలుపుతుంది.

★ GEM అనేది రాజకీయాలు, ఆర్థిక అంశాల్లో స్త్రీలు పాల్గొనడం, ఆర్థిక వనరులపై స్త్రీల పట్టు (ఆదాయ తేడాలు) అనే అంశాలపై దృష్టి సారిస్తుంది.

**సామాజిక ప్రగతి సూచిక (Social Progress Index):**

ఒక దేశం తమ పౌరుల సామాజిక, పర్యావరణ అవసరాలను తీర్చడానికి అందించే సేవలను సామాజిక ప్రగతి సూచిక కొలుస్తుంది.

★ కనీస అవసరాలు, సంక్షేమం, అభివృద్ధి చూపే అవకాశాలు లాంటి 54 అంశాల ఆధారంగా సమాజ సంక్షేమాన్ని అంచనా వేస్తారు.

www.eenadupratibha.net

**ఆర్థిక వృద్ధి - ఆర్థికాభివృద్ధి తేడాలు**

| ఆర్థిక వృద్ధి | ఆర్థికాభివృద్ధి |
|---|---|
| 1. వస్తుసేవల పెరుగుదలను తెలుపుతుంది. అంటే వాస్తవిక స్థూల జాతీయ ఉత్పత్తిలో పెరుగుదలను తెలుపుతుంది. | 1. ఆర్థికాభివృద్ధి దేశంలో ఆర్థిక వృద్ధితో పాటు వ్యవస్థాపూర్వక, సంస్థాగత సాంఘిక, ఆర్థిక మార్పులను తెలుపుతుంది. |
| 2. ఇది ఏకముఖ ప్రక్రియ | 2. ఇది బహుముఖమైంది. |
| 3. పరిమాణాత్మక (Quantitative) మార్పులను తెలుపుతుంది. | 3. పరిమాణాత్మక అంశాలతో పాటు గుణాత్మక (Qualitative) మార్పులను తెలుపుతుంది. |
| 4. ప్రభుత్వ జోక్యం అంతగా అవసరం లేదు. | 4. ప్రభుత్వ జోక్యం అవసరం. |
| 5. ఇది సాంకేతిక మార్పులు తెస్తుంది. | 5. ప్రజా జీవన ప్రమాణంలో మార్పులు తెస్తుంది. |
| 6. స్వల్ప కాలానికి చెందింది. | 6. దీర్ఘకాలానికి చెందింది. |
| 7. అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధం ఉన్న అంశం. | 7. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించింది. |
| 8. ఇది సంకుచిత (Narrow) భావన. కేవలం ఆదాయం/ ఉత్పత్తి పెరుగుదలను మాత్రమే తెలుపుతుంది. | 8. ఇది విశాలమైన (Broad) భావన. ఆర్థిక వ్యవస్థలోని అన్ని అంశాల్లో మార్పును తెలుపుతుంది. |
| 9. ఆర్థిక వృద్ధితో సామాజిక మార్పు సాధ్యం కావచ్చు/ కాకపోవచ్చు. | 9. ఇది తప్పనిసరిగా సామాజిక మార్పును తెస్తుంది. |
| 10. దీన్ని వార్షిక వృద్ధిరేటు ద్వారా లెక్కిస్తారు. | 10. దీనిలో పేదరికం తగ్గుదల, మానవ వనరుల వృద్ధి, జీవనస్థాయి పెరుగుదల లాంటి అంశాలుంటాయి. |
| 11. ఇది వృద్ధి జరిగితే పేదరికం తగ్గుతుందని తెలుపుతుంది (Trickle down theory). దీన్ని సాంప్రదాయ అర్థశాస్త్రం బలపరుస్తుంది. | 11. పేదరికాన్ని తగ్గిస్తే వృద్ధి పెరుగుతుందని తెలుపుతుంది. ఇది ఆధునిక అర్థశాస్త్రంలో ముఖ్య భావన. |

**రచయిత : దాసరి రాజేందర్**

www.eenadupratibha.net